## షేర్స్ వ్యాపారం ప్రారంభించండి

మరే ఇతర వ్యాపారానికంటే లాభదాయకమైన షేర్స్ వ్యాపారాన్ని ప్రారంభించండి.

షేర్ మార్కెట్ అంటే ఏమిటో అసలు మీకు ఏమీతెలియకపోయినా, ఎంత తెలిసినా మిమ్మల్ని ఒక పరిపూర్ణమైన, శక్తివంతమైన పెట్టుబడిదారునిగా తీర్చిదిద్దుతుంది భిష్ణోయ్ శిక్షణ.

మారుమూల గ్రామాల్నుంచి సైతం, మీ ఇంటిపట్టునే ఉండి నిర్వహించే వీలున్న, అతి తక్కువ పెట్టుబడి (రూ 250/-) మొదలుకొని ఎంతైనా పెట్టుబడిగా పెట్టి అనూహ్యంగా అభివృద్ధిచెందడానికి అవకాశం వున్న, ఏవిధమైన పోటీలేని, ఎవ్వరైనా నిర్వహించగల (గృహిణిలు, విద్యార్థులు సైతం) ఓ వ్యాపారం గురించి ఒక క్రమబద్ధమైన, పూర్తిస్థాయి శిక్షణ పొందండి.

భవిష్యత్ కాలంలో అనూహ్యంగా అభివృద్ధి చెందే ఒక అద్భుతమైన వ్యాపారం గురించి కూలంకషంగా తెలుసుకోండి. పూర్తి వివరాలకు మీ చిరునామాతో వెంటనే రాయండి.

**BHISHNOI INFO COUNSEL**
8-3-1060/B2, SRINAGAR COLONY
HYDERABAD-500 873

# కొత్త రచయితలు

## టీజింగ్ టీనేజ్

గమనిక:
ఈ శీర్షికన ఇప్పటి వరకూ లవ్ స్టోరీలు మాత్రమే ప్రచురించాం. వచ్చే సంచిక నుంచి ఇతరత్రా కథలు కూడా ప్రచురించనున్నాం. గమనించమనవి. —ఎడిటర్

గతించిన గతాన్ని గురించి తలచుకుంటే ఒకొక్కసారి నవ్వు వస్తుంది. ఒక్కోసారి వింతగానూ అనిపిస్తుంది. మళ్ళీ ఆ గతం ప్రస్తుతంలోకి వస్తే బాగుండుననిపిస్తుంది. ఏది ఏమైనా ఆ గతం మళ్ళీ వస్తే మాత్రం మనం అప్పుడు రియాక్ట్ అయినట్లు ఇప్పుడు కాకపోవచ్చు.

ఆరేళ్ళ క్రిందట...

నేను రోజూ కాలేజ్ అవగానే టైప్ క్లాస్‌కు వెళ్ళి వచ్చేవాణ్ణి. అవి ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న రోజులు. అలా రోజూ వెళ్తున్నప్పుడు ఒక రోజు కొంత మంది అమ్మాయిలు (నలుగురు అనుకుంటాను) నా వైపే చూడడం గమనించాను. వారిని చూడడం అదే మొదటిసారి కాదు. కానీ బాగా నోటీస్ చేయడం మాత్రం అప్పుడే. అప్పుడు మామూలుగా వెళ్ళిపోయాను.

అది మొదలు ప్రారంభమయింది కొత్త కథ. రోజూ నేను వెళ్తున్న టైప్‌కే వారు అక్కడ వుండడం, నా గురించి గుసగుసగా మాట్లాడుకోవడం గమనించసాగాను. ఇలా రోజూ గడవసాగింది. ఒకరోజు వస్తున్నప్పుడు వారు నన్ను చూసి నవ్వారు. నేను కూడా అప్రయత్నంగా నవ్వాను. అందులో బొద్దుగా చామన ఛాయలో వున్న అమ్మాయి మాత్రం నవ్వలేదు. నన్నే చూడసాగింది. ఇలా ఒకరోజు కాదు, రెండు రోజులు కాదు. కొన్ని వారాలు జరిగింది.

ఒకరోజు వస్తున్నప్పుడు అందులో ఒక అమ్మాయి బొద్దుగా వున్న అమ్మాయిని మోచేత్తో పొడుస్తూ "ఏయ్! కరుణా! నీ అడోనిస్ వస్తున్నాడేవ్ మాట్లాడు" అనడం నాకు స్పష్టంగా వినిపించింది. అడోనిస్ అంటే ఏమిటో నాకు తెలియదు. ఏమయి వుంటుందా అని థింక్ చేయసాగాను. ఆ తర్వాత మా ఫ్రెండ్‌ని అడిగాను. అడోనిస్ అంటే ఏ వెరీ హాండ్ సమ్ మాన్ అని చెప్పాడు. అడోనిక్ అనే వ్యక్తి గ్రీకు పురాణ కథల్లో వుండేవాడనీ, చాలా అందగాడనీ, అతని వల్లే ఆ పదము వచ్చిందనీ కూడా చెప్పాడు.

నాకు సరయిన పేరే పెట్టారనిపించింది. సొంత డబ్బా కొట్టుకోవడం కాదు కానీ నేను చూడడానికి కొద్దిగా బాగా వుంటాను. అప్పుడయితే ఇంకా టీనేజ్ కదా! ఇంకాస్త బాగా వుండేవాడిని.

కొన్ని రోజుల తర్వాత కరుణ, ఆ గ్యాంగ్‌లోని ఒకమ్మాయి మా టైప్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరారు. ఒక రోజు ఆ స్నేహితురాలు నా దగ్గరకు వచ్చి "ఎక్స్‌క్యూజ్ మీ. మే ఐ నో యువర్ నేమ్?" అంది. నా పేరుతో ఏం పని అని అడుగుదామనుకున్నాను. కానీ వెంటనే "షన్ముఖ, ఐ మీన్ శంతన్" అని చెప్పేశాను.

ఒకరోజు నా టేబుల్ వద్ద కరుణ కాడ్‌బరీస్ చాకొలెట్ పెట్టి వెళ్ళిపోయింది. ఎందుకా అని ఆమె వైపు చూశాను. కొత్త బట్టలు వేసుకుంది. పుట్టిన రోజేమో అనుకుని ఆ చాకొలెట్ తీసుకోవాలా వద్దా అని ఆలోచించి చివరకు వాళ్ళు వెళ్ళిపోయిన తరువాత తీసుకున్నాను. మరుసటి రోజు కరుణ స్నేహితురాలు "చాకొలెట్ తీసుకున్నారా?" అని అడిగింది. నేనేమీ మాట్లాడకుండా వచ్చేశాను. వెంటనే ఆ అమ్మాయి కరుణతో "చాకొలెట్ తీసుకున్నట్టే వున్నాడే. అతను కూడా నిన్ను ప్రేమిస్తున్నాడేమో" అని మెల్లగా అంది. వాళ్ళు ఎంత మెల్లగా మాట్లాడుకున్నా నాకు వినబడేటంత మెల్లగా మాట్లాడేవారు. ఆ మాటలు విని నేను ఒక్కసారిగా షాకయ్యాను 'బాబోయ్! ఆ అమ్మాయి నన్ను ప్రేమిస్తూందా!' అని. ఆ రోజు నుంచి కరుణ నా వైపు చూసే చూపులే మారిపోయాయి. నేనేమి చేయాలా అని ఆలోచించసాగాను. ఆ అమ్మాయితో 'ప్రేమా లేదు దోమా లేదు' అని చెప్పేద్దామా అనిపించేది. కానీ వేరెతకు నేనే ప్రొసీడయి చెప్తే బాగుండదని ఊరుకున్నాను.

ఆ రోజు దీపావళి పండుగ మరుసటి రోజు. నేను టైప్ క్లాస్‌కి పండక్కి కుట్టించుకున్న కొత్త బట్టలు వేసుకుని వెళ్ళాను. అప్పుడు కరుణ




GLOBEL/BIC/TEL 053

స్నేహితురాలు నా టేబుల్ వద్దకు వచ్చి టైప్ మిషన్ ప్రక్కనే ఒక కాగితం వుంచి వెళ్ళిపోయింది. తీసుకోవాలా వద్దా అని మథన పడసాగాను. ఒక పక్క ఏం రాసిందో అని కుతూహలం! చివరకు తీసి చదివాను. అందులో ఇలా వుంది.

ప్రియమైన మీకు, (షన్ముకు)

మీకు నా పేరు తెలుసనుకుంటాను. అయినా మరోసారి చెప్తున్నాను. నా పేరు కరుణ. ఈ రోజు మీరెంతో బాగున్నారు. మీరంటే నాకు ఇష్టం. మరి మీరేమంటారు? మీరు చెప్పే సమాధానంపై నా జీవితం ఆధారపడి వుంది. మీరు కూడా నన్ను ప్రేమిస్తుంటే రేపు కూడా ఈ రోజు వేసుకున్న డ్రెస్సే వేసుకుని రండి.

మీ దాన్ని కావాలనుకునే. కరుణ


అది చదవగానే నేను విభ్రాంతికి లోనయ్యాను. ఆ అమ్మాయితో నేను ఒక్కసారి కూడా మాట్లాడలేదు. అయినా టెన్త్ చదివే ఆ అమ్మాయి నన్ను ప్రేమించడమేంటి? నా జవాబుపై ఆమె జీవితం ఆధారపడి వుండడమేమిటి? అని ఆలోచించసాగాను. ఆ మరుసటి రోజు అసలు టైప్ క్లాస్‌కే వెళ్ళలేదు.

రెండు రోజుల తరువాత కరుణ స్నేహితురాలు నాకు వినబడేటట్లు "ఉత్తరం తీసుకుని చదివితే సరా! జవాబివ్వాలన్న ధ్యాసే లేదు" అని అంది. ఏం చేయాలా అని ఆలోచించి చివరకు నా మిత్రుడయిన చరణ్‌కు విషయమంతా చెప్పాను. నా భయమేమిటంటే ఈ విషయమంతా మా ఇంట్లో తెలిస్తే ఏమంటారోనని. అదీ గాకుండా అప్పుడు నేను మా అమ్మమ్మ వాళ్ళ దగ్గర వుండి చదువుకునేవాణ్ణి. మా అమ్మా, నాన్న వేరే వూళ్ళో వుండేవాళ్ళు. నేనూ చరణ్ ఇద్దరమూ కలిసి ఆలోచించి చివరకు లెటర్ రాసి కరుణ స్నేహితురాలికి ఇచ్చాము.

*కరుణా!*

*అసలు నీ వయసెంతని ప్రేమలో పడటానికి? అదీ గాకుండా నా గురించి నీకేమి తెలుసు! ఇన్ని రోజులూ మీ మూవ్‌మెంట్స్ చూసి ఫ్రెండ్లీగా ఫీలయ్యానే కానీ నీ మీద ప్రేమతో కాదు. అర్థం చేసుకుంటావను కుంటాను.*

*- ఎప్పటికీ మిత్రుడు శంతన్*



ఇదీ మేము రాసిన జవాబు. ఆ సమయంలో నేనూ, చరణ్ వయసుకు మించి ఆలోచించామేమో. అందుకే లెటర్ అలా రాశాము. ఆ లెటర్ చదివిన తర్వాత కరుణ ఎలా ఫీలయిందో కానీ ఆమె ఫ్రెండ్స్‌మాత్రం నా వైపు కోపంగా చూసేవారు.

ఇక ప్రస్తుతానికి వస్తే...

ఇప్పుడు కరుణకు పెళ్ళయి పోయింది. అప్పుడప్పుడూ కనిపిస్తూంటూంది. కనబడ్డప్పుడు బిడియంగా తల వంచుకుని వెళ్ళిపోతుంది. ఆమె కనిపించినప్పుడల్లా అనిపిస్తుంటుంది 'మీ జవాబుపై నా జీవితం ఆధారపడి వుంది' అన్న అమ్మాయేనా ఈమె అని. అయినా ఇప్పుడు గ్రహించి వుంటుంది, ఆ రోజుల్లో వయసు ఆకర్షణ ఆమెచేత అలా వ్రాయించి వుంటుందని.

వింతగా లేదూ నా కథ! ఇద్దరమూ ఒక్కసారి కూడా మాట్లాడుకోలేదు. కానీ ప్రేమలూ, విడిపోవడాలూ అన్నీ జరిగిపోయాయి. *

రచయిత చిరునామా:
బి. నరహరి
15/76 కమలానగర్
అనంతపురం - 515 001

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్